సర్వీస్ రోడ్డు బంద్‌తో ట్రాఫికర్

● సర్వీసు రోడ్ల సమస్యలు తీర్చకుండా ఫ్లైఓవర్ ప్రారంభంపై విమర్శలు

గోల్నాక, మే 5 (ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ నిర్మాణం చేస్తే ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని.. రవాణ మార్గం కాస్త సుగమనం అవుతుందని ప్రజలు భావించారు. కాని అంబర్‌పేటలో ఫ్లైఓవర్ నిర్మాణంతో గోల్నాక ప్రాంతంలో సమస్యలు తీరకపోగా ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి ముందు గోల్నాక ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సాఫీగా కొనసాగేది. అంతగా ఇబ్బందులు ఉండేవి కాదు. ఫ్లైఓవర్ నిర్మాణం అయి వాహనాల రాకపోకలు కొనసాగుతుండడంతో గోల్నాక ప్రాంతంతో ట్రాఫిక్ సమస్య తీరలేదు. గోల్నాక ప్రాంత ప్రజలు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నామని వాపోతున్నారు. గోల్నాక చర్చి నుంచి ప్రారంభమైన ఫ్లై ఓవర్‌కు రెండు వైపుల సర్వీసు రోడ్లు బాగా ఉంటే ఆ సమస్య వచ్చేది కాదు. కానీ ఇక్కడ సర్వీసు రోడ్ల విషయంలో నెలకొన్న సమస్యతోనే ఇబ్బందులు తలెత్తిన వాటి పరిష్కారానికి పాలకులు చర్యలు తీసుకోకపోవడమే సమస్యకు ప్రధానకారణంగా మారింది. గోల్నాక నుంచి లెఫ్ట్ సైడ్ సర్వీసు రోడ్డు ఒకటే కొనసాగుతుండగా రైట్‌సైడ్ సర్వీసు రోడ్డు సమాదులు ఉండడంతో ఆ రోడ్డును పునరుద్ధరించకుండా బంద్ చేయడంతో సమస్య ఏర్పడింది. ఆ రోడ్డు విషయంలో అధికారులు, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనంగా ఉండడంతో ప్రజలకు నరకయాతనగా మారింది. 2018 మే నెలలో అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం పనులకు అప్పటి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేశారు. ఏడేళ్లుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం కొనసాగింది. ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తయింది కాని కింద సర్వీసు రోడ్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. సోమవారం కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ ప్రారంభోత్సవం చేశారు. సర్వీసు రోడ్ల సమస్య తీర్చకుండా ప్రారంభచేయడంపై ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతుంది. గోల్నాక నుంచి అంబర్‌పేట ముక్రమ్ హోటల్ వరకు నిర్మాణం చేసిన ఈ ఫ్లైఓవర్‌కు ఇరువైపుల సర్వీసు రోడ్లపై అన్ని సమస్యలు ఉన్నాయి. సమస్యలు తీర్చకుండా ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తే ఇక సమస్యలు తీరేదెప్పుడు... నిత్యం ప్రజలు నరకాన్ని అనుభవించాల్సిందేనా అని ప్రజలు అంటున్నారు. గోల్నాకలో ఒకవైపు సర్వీసు రోడ్డు బంద్ ఉండడంతో ఈ ప్రాంతంలో ఉన్న స్కూల్స్‌కు పిల్లలు వెళ్లడం ఇబ్బందికరంగా మారింది. గోల్నాక చౌరస్తా ఇప్పుడు ట్రాఫిక్ దిగ్బంధనంగా తయారైంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫిబ్రవరి 25న ఫ్లైఓవర్‌ను అధికారులతో సందర్శించి ప్రజలతో వస్తున్న వత్తిడి 26న శివరాత్రి పండుగ రోజునుంచి అనధికారింగా ఫ్లైఓవర్‌పై నుంచి వాహనాల రాకపోకలు కొనసాగిస్తామని ప్రకటించి కొనసాగిస్తున్నారు. అప్పటి నుంచి గోల్నాకలో ట్రాఫిక్ ఇబ్బందులు మొదలయ్యాయి. రెండు నెలల తరువాత అన్ని సమస్యలు పూర్తి చేసి ఫ్లైఓవర్‌ను అధికారికంగా ప్రారంభిస్తామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అప్పుడే ప్రకటించారు. కాని అవి పూర్తి కాకుండానే ఫ్లైఓవర్‌ను ప్రారంభించడంతో స్థానికులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గోల్నాకలో బంద్ ఉన్న సర్వీసు రోడ్డులోని సమస్యను పరిష్కరిస్తే గోల్నాకలో సమస్య తీరుతుంది. అదిశగా ప్రభుత్వం, అధికారులు, కేంద్రమంత్రి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. శనివారం ఫ్లైఓవర్ సందర్శించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కూడా స్థానికులు కలిసి ఈ విషయంపై విన్నవించుకోవడం జరిగింది. ఫ్లైఓవర్ నిర్మాణం చేసి ఇబ్బందులు లేకుండా ఉండాలి కాని, నిర్మాణం చేసి ఇబ్బందుల పాలు చేయడం దారుణమని స్థానికులు వాపోతున్నారు. ఇప్పుడు గోల్నాక చౌరస్తా నుంచి కాచిగూడ కమేళా వరకు నిత్యం ట్రాఫిక్ స్తంభించి పోవడం అంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉందో అర్థం చేసుకోవాలని ప్రజలు అంటున్నారు. ప్రజల ఇబ్బందుల తీర్చడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలంటున్నారు.


గోల్నాక చర్చి నుంచి మొదలైన ఫ్లైఓవర్


గోల్నాక నుంచి ఛే నంబర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డు వెళ్లడానికి వీలు లేకుండా ఉన్న దుస్థితి


గోల్నాక చౌరస్తాలో ఫ్లైఓవర్‌తో అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్


షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 42 మందికి ఎమ్మెల్యే షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నల్లకుంట, బాగ్ అంబర్‌పేట, అంబర్‌పేట డివిజన్ల కార్పొరేటర్లు యాకర అమృత, బి.పద్మావెంకటరెడ్డి, విజయ్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గెలుపు పత్రాన్ని అందుకున్న జై పవన్‌రాజ్ తదితరులు

ఆరె కటిక సంఘం ఎన్నికల్లో జై పవన్‌రాజ్ విజయం

నల్లకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఆరె కటిక సంఘం ఎన్నికల్లో ఇసామియాబజార్‌కు చెందిన జై పవన్‌రాజ్ ఘన విజయం సాధించారు. పారదర్శకంగా జరిగిన ఈ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు పోటీలో ఉండగా వారు పదుల సంఖ్యలో ఓట్లు సాధించగా జై పవన్‌రాజ్‌కు 692 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా జై పవన్‌రాజ్ మాట్లాడుతూ కాచిగూడ ఆరె కటిక సంఘానికి గత కొన్ని ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో సంఘం నిధులను కొందరు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం తాను అందరి సహకారంతో విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన విజయానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సంజయ్‌రాజ్ దంబిక, శ్రీనివాస్,జితేందర్, వెంకటేష్, ఉదయ్, మురళీధర్, వినయ్, ఉదయ్‌కుమార్, అశోక్, తులసి, గోవింద్‌రాజ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభి టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.ఎస్.వి.సత్యనారాయణ, యు.విజయభాస్కర్

డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రి అనుమతి రద్దు చేయాలి

● పట్టాభి టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని పట్టాభి టవర్స్‌కు సంబంధించిన దారిని తమ ఆస్పత్రికి దారి అని చూపించి జీహెచ్‌ఎంసీ నుంచి తప్పుడు అనుమతి పొంది అక్రమంగా నిర్మించిన ఆస్పత్రి అనుమతిని రద్దు చేసి తమ టవర్ వైపు చూపించిన రోడ్డును మూసివేయాలని పట్టాభి టవర్స్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.ఎస్.వి.సత్యనారాయణ, యు.విజయభాస్కర్, కోశాధికారి జగన్‌మోహన్‌రెడ్డిలు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రికి షోకజ్ నోటీసు జారీ

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని డాక్టర్ శంకర్ ప్రజా ఆస్పత్రికి హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి షోకజ్ నోటీసు సోమవారం జారీ చేశారు. ఆస్పత్రి ఏర్పాటు వైద్య, ఆరోగ్య శాఖ నిబంధనల ప్రకారం ఏమి పాటించలేదని నోటీసులో పేర్కొన్నారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు లేవని, భవనం జీహెచ్‌ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని, స్థానికుల నుంచి ఎన్‌వోసీ తీసుకోలేదని, ఫైర్ సేఫ్టీ పాటించలేదని, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి లేదని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేదని వీటిపై వివరణ ఇవ్వాలని డా.శంకర్‌కు నోటీసులు జారీ చేశారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముషీరాబాద్‌లోని కషీష్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ తెలిపారు. సమావేశానికి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, నియోజకవర్గం పార్టీ పరిశీలకులు కించన్న లక్ష్మారెడ్డి, సర్వేశ్వర్, పార్టీ రాష్ట్ర నాయకులు, నగర నాయకులు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు చెందిన నాయకులు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.


రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

అరుణోదయ రామారావుకు నివాళి

నల్లకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): తన జీవితం చివరి శ్వాసవరకు ప్రజల కోసం, విప్లవోద్యమ సంస్కృతిక ఉద్యమంలో ఎనలేని కృషి చేసిన వ్యక్తి అరుణోదయ రామారావు అని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగు నేలపై అరుణోదయ రామారావు పాట ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని వారన్నారు. అరుణోదయ రామారావు 6వ వర్ధంతి సందర్భంగా సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


రాంనగర్ చౌరస్తాలో అన్నదానం ప్రారంభిస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్

రాంనగర్‌లో అన్నదానం

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్ సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నారని అన్నారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజియాదవ్, సయ్యద్ జుహేరి హుస్సేన్, లోకేష్‌యాదవ్, లింగాల శ్రీనివాస్ గౌడ్, పాశం అనిల్‌కుమార్‌యాదవ్, మురళీమోజెస్, కృష్ణవేణి, స్వరూప, భారతి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ చేసినప్పుడే గుర్తింపు

● యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): సమాజసేవ చేసినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు స్థానం లభిస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం మాజీ ఎంపీ ఎం. అంజన్ కుమార్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను ముషీరాబాద్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో విద్యార్థినీలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అరవింద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ అంజన్ కుమార్ యాదవ్ ఎంపీగా బాధ్యతలు నిర్వహించినప్పుడు ముషీరాబాద్‌లో అనేక జఠిలమైన సమస్యలు పరిష్కరించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సైతం ముషీరాబాద్ అభివృద్ధికి కృషిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, టీపీసీసీ మాజీ కార్యదర్శి వెంకటేష్, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు మేడి సురేష్ కుమార్, బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడు రాజ్‌దీప్, నాయకులు నరేందర్‌బాబు, పాశం అనిల్ కుమార్ యాదవ్, జయకుమార్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జఫీర్ హుస్సేన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్


ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సయ్యద్ మసూద్ తదితరులు

ఎంపీ నిధులన్నీ ముషీరాబాద్ అభివృద్ధికే

● ఎంపీ అనిల్ కుమార్ యాదవ్

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి తన ఎంపీ నిధులలో అత్యధికంగా ముషీరాబాద్ నియోజకవర్గానికే కేటాయిస్తానని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్దిక్‌నగర్, సందాని వీధిలో దశాబ్దా కాలంగా ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తన నిధుల నుంచి రూ.10.50 లక్షలు మంజూరు చేయడంతో ఆయనను అభినందిస్తూ సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ భోలక్‌పూర్‌లో అధికంగా మురికివాడ ప్రాంతాలు ఉన్నందున్న ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్ కుమార్ యాదవ్, భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీన్, నాయకులు ఉస్మాన్, అబ్దుల్ ఖరీం, వాహేద్, ముజిద్, ఖైరత్ అలిబాబా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్‌ల జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు అంతా ఈ సమ్మెలో పాల్గొంటారని తెలియజేస్తూ కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్‌కు తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ నేతలు నోటీసు ఇచ్చారు. సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్‌లో డా. గంగాధర్‌ను కలిసి జేఏసీ నేతలు ఈమేరకు ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు అనురాధ, చంద్రమౌళి తదితరులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి, భవన నిర్మాణ కేంద్ర చట్టం 1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979, కాంట్రాక్ట్ కార్మికుల చట్టం- 1970 లను పకడ్బందీగా అమలు చేయాలని, కార్మికులందరికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికసంగాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలని, తదితర డిమాండ్లతో ఈ సమ్మె కొనసాగుతుందని తెలిపారు.



● కిషన్‌రెడ్డిని కలిసిన మారుతీనగర్ బస్తీ వాసులు

గోల్నాక డివిజన్ మారుతీనగర్ బస్తీ నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసి పూలబోకేను అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వారిని అభినందించి బస్తీ సమస్యల పరిష్కారంలో తనసహకారం ఎల్లప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో నూతన అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ప్రతినిధులు వసంతకుమార్, కొమ్ము శ్రీనివాస్, నవకాంత్ సత్యనారాయణ, మోహన్, వెంకటేష్, నర్సింగ్, గణేష్, సంతోష్, అశోక్, బాలకృష్ణ ఉన్నారు.

-గోల్నాక, ఆంధ్రజ్యోతి

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నేత సురేందర్

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరిన అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్ సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు జైసింహల సమక్షంలో తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే గోపాల్ పార్టీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ సురేందర్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సురేందర్ మాట్లాడుతూ అనివార్య కారణాలు, కొందరు వ్యక్తుల వల్ల బీజేపీలో చేరానన్నారు. ఎమ్మెల్యే తమ ఇంటికి వచ్చి ఇక ముందు జరిగిన ఘటనలు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్‌లో చేరానని పేర్కొన్నారు.


ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సురేందర్


తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జరిగిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న చిన్నారులు

సమ్మర్ క్యాంపు ప్రారంభం

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన, వినోదం విలువలతోకూడిన సరదా సరదా సమ్మర్ క్యాంపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నృత్యం, పాడడం, డ్రాయింగ్, క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, చిన్నారులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమయ్య, రూప, రుక్మిణి, దివ్య, అంకమ్మ పాల్గొన్నారు.

'న్యూ అచ్చయ్యనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడి నియామకం చెల్లదు '

రాంనగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని న్యూఅచ్చయ్యనగర్ బస్తీ కమిటీ అధ్యక్షుడిగా బాబుగౌడ్ నియామకం చెల్లదని ఆ బస్తీ కమిటీ చైర్మన్ పి.యాదగిరి, మాజీ అధ్యక్షుడు సదానందం, సభ్యులు నారాయణ, సంజీవ అన్నారు. సోమవారం బస్తీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బస్తీ కమిటీ నిబంధనలకు విరుద్ధంగా ఆయన అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారని, బస్తీలో 150 మంది సభ్యులు ఉంటే 15 మంది నిర్ణయం ప్రకారం అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం బాబుగౌడ్‌కు తగదన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన బాబుగౌడ్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం తాను అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు చైర్మన్, మాజీ అధ్యక్షుడు మాటమార్చి బస్తీవాసులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

అన్నమయ్య సంకీర్తనల గాన మహాయజ్ఞం ప్రారంభం

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనల గాన మహాయజ్ఞం సోమవారం త్యాగరాయ గానసభలో ఘనంగా ప్రారంభమైంది. దక్షిణ భారత తొలి వాగ్గేయకారుడు అన్నమాచార్య వేలాది సంకీర్తనలలో 108 సంకీర్తనలు గ్రహించి ఆయన 617వ జయంతి సందర్భంగా గురు వెంకటేశ్వర్లు కోటపాటి గోవింద దాస స్వరరచనతో గాన మహాయజ్ఞం ప్రారంభమైంది. ఎస్ఎఎస్ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనురాధ కోటపాటి పర్యవేక్షణలో తొలిరోజు జరిగిన గాన గోష్టిలో పలువురు గురు వెంకటేశ్వర్లు కోటపాటి గోవింద దాస శిష్య బృందం కూడా ఆయనతోపాటు మధురంగా అన్నమాచార్య సంకీర్తనలు గానం చేశారు.


చలో అంబర్‌పేట్ బస్సు ర్యాలీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుప్రియ

నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధి

● కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ హయాంలోనే దేశం అన్ని విదాలా అభివృద్ధి చెందుతున్నదని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ వార్డ్ కార్యాలయం నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవానికి, అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభకు బస్సులలో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ ర్యాలీని కార్పొరేటర్ సుప్రియ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, నితిన్ గడ్కారీలు అభివృద్ధి పనులకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, పార్టీ నాయకులు జమాల్‌పురి నందు, అనిల్ కుమార్, లక్ష్మణ్, మెట్టు వాసు, బాలకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

● గాంధీనగర్ సీఐ బోస్ కిరణ్


సీఐ బోస్ కిరణ్

కవాడిగూడ, మే 5 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కల్పించినా కఠిన చర్యలు తప్పవని గాంధీనగర్ సీఐ బోస్ కిరణ్ రౌడీ షీటర్లను, పాతనేరస్తులను హెచ్చరించారు. సోమవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఎస్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాతనేరస్తులు నేరాలు చేయకుండా ఉండాలని సూచించారు. గాంధీనగర్ పీఎస్ పరిధిలో ఉన్న ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా కలవవచ్చని దళారీలను ఆశ్రయించవద్దన్నారు. పీఎస్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, పాతనేరస్తులపై నిరంతరం నిఘా పెడుతున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం పెట్రోలింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని, పీస్ కమిటీ సభ్యులు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావచ్చని సీఐ బోస్ కిరణ్ తెలిపారు.

సుందరీకరణ పనుల పరిశీలన

చిక్కడపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ సర్కిల్ సుందరీకరణ పనులను కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్కిల్ చౌరస్తా సుందరీకరణ పనులను సోమవారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ పనులను వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 ఏఇ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, పార్టీ నాయకులు శ్రీకాంత్, సురేష్, రాజు, నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల కోసమే కులగణన

కులగణనకు అంగీకరించి మరో సంచలన చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రధాని మోదీ తీసుకున్నారని హర్షం వ్యక్తం చేస్తూ గాంధీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు పాల్గొని మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్నదే ప్రధాని మోదీ వికసిత భారత్ ముఖ్యఉద్దేశమన్నారు. అందులో భాగంగానే జనగణనతోపాటు కులగణన నిర్ణయం కేంద్రప్రభుత్వం తీసుకోవడం జరిగిందన్నారు. పార్టీ నాయకులు ఎ. వినయ్‌కుమార్, టి. గోపాల్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, దామోదర్, వీఎస్టీ రాజు, సత్తిరెడ్డి, వాణిశాస్త్రి, సంయుక్తరాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.


హుండీ లెక్కింపులో పాల్గొన్న ఆలయ సిబ్బంది, భక్తులు

ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం హుండీ ఆదాయం 2 లక్షల 19 వేల 540 రూపాయలు వచ్చింది. కాగా ఈ- హుండీ ఆదాయం గత ఏప్రిల్ నెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు 16 వేల 534 రూపాయలు వచ్చింది. సోమవారం ఆలయం హుండీ ఆదాయాన్ని ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, భక్తులు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో దేవనాథం, చైర్మన్ సుధాకర్‌లు మాట్లాడుతూ స్వామివారికి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికిగాను భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ సభ్యులు శ్యామ్‌ముదిరాజ్, ఆలయ అర్చకులు కె. వెంకటాద్రి పాల్గొన్నారు.